క్లుప్తంగా

గంబూషియా చేపల విడుదల



వేమగిరిలో గంబూషియా చేపలను విడుదల చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

కడియం: దోమల లార్వా నిర్మూలనా చర్యల్లో భాగంగా వేమగిరిలోని పలు ప్రాంతాలలో గురువారం గంబూషియా చేపలను విడుదల చేసినట్లు ఆరోగ్య విస్తరణాధికారి ఎంవీబీ రామకృష్ణ తెలిపారు. గుత్తుల వెంకటస్వామి కాలనీ, వాటర్ ట్యాంక్ ఏరియాల్లోని నిల్వ నీటిలో ఈ చేపలను వదిలిపెట్టామన్నారు. దోమల లార్వాలను ఈ చేపలు తినేస్తాయని, తద్వారా దోమల సంతతి అభివృద్ధి ఆగిపోతుందని వివరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చెల్లుబోయిన శ్రీనివాసు, గుత్తుల కృష్ణ, వాసంశెట్టి బాలాజీ, అనసూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

చంటియ్య కుటుంబానికి పరామర్శ



చంటియ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు

కడియం: నర్సరీ రంగ ప్రముఖుడు పుల్లా సత్యనారాయణ (చంటియ్య) మృతి తీరని లోటు అని రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. ఆయన గురువారం కడియపులంకలో చంటియ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా చంటియ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



అర్జీలు స్వీకరిస్తున్న సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్

సీటీఆర్ఐ: ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ప్రజా దర్బార్ అనే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. తుమ్మలావలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో గురువారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక 35 నుంచి 40 వార్డుల ప్రజలు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రజలకు సంక్షేమ పథకాలు సజావుగా చేరుతున్నదీ, లేనిదీ తెలుసుకోవడానికి చక్కని వేదికగా ఉపయోగపడుతుందన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



వృద్ధులకు పండ్లు పంచిపెడుతున్న విద్యార్థులు

రాజమహేంద్రవరం సిటీ: పేదలపై దయ, సానుభూతి కలిగి ఉండాలని కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి అన్నారు. అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్వర్ణాంధ్ర ఆశ్రమంలోని వృద్ధులకు విద్యార్థులతో పండ్లు పంపిణీ చేయించారు.

సినిమాలు



శ్యామల	: వేట్టయన్
సూర్యమినీ	: జిగ్రా
సూర్యప్యాలెస్	: ఇద్దరు
శివజ్యోతి	: లవ్‌రెడ్డి, ది డీల్
అనుశ్రీ	: జనక అయితే గనక
స్వామి	: శ్వాగ్
అశోక	: విశ్వం
రాజా	: మార్టిన్
రంభ	: రాధేకృష్ణ, మా నాన్న సూపర్ హీరో
ఊర్వశి	: సత్యం సుందరం
మేనక	: కల్లు కాంపౌండ్, మార్టిన్
కుమారి	: దేవర
అప్సర	: దేవర
నామవరం	
వీఎస్ మహల్	: వేట్టయన్, విశ్వం
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: దేవర
కడియం	
వెంకట సూర్య	: దేవర, వేట్టయన్

సదా మీ సేవలో..

- మహిళల భద్రతకు పోలీసుల ప్రాధాన్యం
- మహిళా రక్షక్ బృందాల ఏర్పాటు
- రద్దీ ప్రాంతాలలో గస్తీ
- ఎస్పీ స్వీయ పర్యవేక్షణ



మహిళా రక్షక్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితరులు (ఫైల్)

కంబాలచెరువు: మహిళల భద్రతకు భరోసా కల్పించాలన్న లక్ష్యంతో మహిళా రక్షక్ అనే కార్యక్రమానికి పోలీసులు శ్రీకారం చుట్టారు. ఏలూరు రేంజ్ ఐజీ మార్గనిర్దేశంలో గాంధీ జయంతి రోజు ఎస్పీ డి.నరసింహ కిషోర్ పర్యవేక్షణలో ప్రారంభమైంది. పక్షం రోజుల్లోనే మంచి ఫలితాలు అందిస్తూ ప్రజల ప్రశంసలు అందుకుంటోంది. మహిళల భద్రత ఒక సమస్యగా మారిన ఈ రోజుల్లో వాటిని పరిష్కారం చేసే దిశగా మహిళా రక్షక్ పేరుతో ఇటువంటి వినూత్న ఆలోచనకు బీజం పడటం మంచి పరిణామమని పలువురు పేర్కొంటున్నారు. సమస్య ఉత్పన్నమైన వెంటనే ఫోన్ కాల్ ద్వారా ఫిర్యాదును అందుకోవడం ద్వారా ముందుగా గుర్తించి, నివారించేందుకు అవకాశం ఉంటుంది.

క్షేత్రస్థాయికి మహిళా పోలీసులు

మహిళా రక్షక్ బృందంలో మహిళా హెచ్‌సీ, కానిస్టేబుళ్లు ఉంటారు. వీరు వాహనాలపై బృందంగా సంచరిస్తారు. కళాశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ఆలయాలు తదితర మహిళలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో గస్తీ కాస్తారు. తమ దృష్టికి వచ్చిన సమస్యలతో పాటు కంట్రోల్ రూమ్ నుంచి వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తారు. ఈవ్ టీజింగ్, అమ్మాయిలను ర్యాగింగ్ చేయడం, రాత్రి సమయాల్లో మహిళల ఇబ్బందులు తదితర వాటిపై దృష్టి సారిస్తారు. ఏ ఘటన నైనా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి కంట్రోల్ రూమ్‌కు పంపుతారు. తమను ఆశ్రయించిన వారికి రక్షణగా నిలుస్తారు.

ఆపదలో ఉంటే డయల్ 112

ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు తమ రక్షణ కోసం 94932 06006 నంబర్‌కు లేదా టోల్ ఫ్రీ నంబర్ 112కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. ఈ నంబర్లు జిల్లా ఎస్పీ స్వీయ పరివేక్షణలో పని చేస్తుంటాయి. ఆ నంబర్లకు ఫోన్ చేసిన వెంటనే కాల్ సెంటర్‌లో పోలీసు ఉద్యోగులు సంబంధిత వివరాలు తీసుకుంటారు. మహిళలు, బాలికలు ఉన్న ప్రాంతానికి దగ్గరలోని పోలీస్ సిబ్బందిని పంపుతారు. దీని వల్ల తక్కువ సమయంలోనే మహిళా రక్షకులు, స్థానిక పోలీసులు అక్కడికి చేరుకుని ఆపదలో ఉన్న అతివలను రక్షించే అవకాశం ఉంటుంది. ఘటన స్థలానికి చేరుకున్న మహిళా రక్షక దళ సభ్యులు ఆ వివరాలను ఎప్పటికప్పుడు కంట్రోల్ రూమ్‌కు తెలియపరుస్తారు. వారిచ్చే సూచనల మేరకు పని చేస్తారు. ఈ నంబర్లకు ఏ సమయంలోనైనా సహాయం కోసం ఫోన్ చేయవచ్చు.

సత్ఫలితాలు

మహిళా రక్షక్ బృందాలను ఏర్పాటు చేసిన 15 రోజుల్లో సత్ఫలితాలు వచ్చాయి. ఆపదలో, ప్రమాదంలో ఉన్న బాలికలను గుర్తించారు. వాటిలో కొన్ని ఘటనలు..

- రాజమహేంద్రవరంలో సోమవారం రాత్రి మహిళా రక్షక్ టీం గస్తీ తిరుగుతుండగా ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు బాలికలను గుర్తించారు. అనుమానంతో వారిని ఆపి వివరాలు అడగ్గా పొంతన లేని సమాధానం చెప్పారు. దీంతో గట్టిగా ప్రశ్నించగా తామంతా ఇన్‌స్టాగ్రామ్‌లో స్నేహితులని, ఏదో సాధిద్దామని దూరంగా వెళ్లిపోయేందుకు ఇంట్లో వారికి చెప్పకుండా వచ్చామన్నారు. దీంతో మహిళా రక్షక్ టీం వెంటనే అప్రమత్తమైంది. ఆ బాలికల తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారిని రప్పించింది. బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించింది.
- ఇద్దరు బాలికలు ఇన్‌స్టాగామ్‌లో తమకు పరిచయమైన బాలుడితో కలిసి ఇంట్లో చెప్పకుండా రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. అక్కడ అనుమానాస్పదంగా తిరుగుతుండగా పెట్రోలింగ్‌లో ఉన్న మహిళా రక్షక్ టీం వారిని గుర్తించింది. వివరాలు తెలుసుకుని ప్రకాశం నగర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లింది. వారి తల్లిదండ్రులను పిలిపించి, బాలికలకు కౌన్సెలింగ్ ఇచ్చి క్షేమంగా అప్పగించారు.
- రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో అర్ధరాత్రి సమయంలో ఒంటరిగా ఉన్న మహిళను ఒక ఆకతాయి వెంబడించాడు. ఆమె భయంతో కేకలు వేసింది. సమీపంలో పెట్రోలింగ్‌లో ఉన్న మహిళ రక్షక్ టీం క్షణాల్లో అక్కడ చేరుకుని ఆకతాయిని అదుపులోకి తీసుకుంది. అతడిని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లింది.

మహిళల భద్రతకు పెద్దపీట

మహిళల భద్రత అనేది సమాజంలోని అనేక అంశాలను ప్రభావితం చేసే క్లిష్టమైన అంశం. జిల్లాలో వారి భద్రతకు అన్ని విధాలా తగిన చర్యలు తీసుకుంటున్నాం. మహిళలపై నేరాలకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించం. చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. మహిళల రక్షణ కోసమే మహిళా రక్షక్ రూపుదిద్దుకుంది.

– డి.నరసింహ కిశోర్, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం నగరంలో పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ షిరిడీ సాయి నగర్, లక్ష్మీ నరసింహ నగర్, శ్రీపాద వారి వీధి, వడ్డెర కాలనీ, అఫీషియల్ కాలనీ, శాంతారామ్ హాస్పిటల్ ఏరియా, సాయిబాబా గుడి ఏరియా, కంచర లైన్, కొత్తపేట, మెయిన్ రోడ్డు ఏరియా, కొంతమూరులోని కంటిపూడి లే అవుట్, క్రషర్స్ ఏరియాలలో విద్యుత్ ఉండదు.

- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ హౌసింగ్ బోర్డు ఏరియా, స్పిన్నింగ్ మిల్లు 1, 2, ఆటోనగర్ ఏరియా, స్వరూప నగర్ ఏరియాలలో విద్యుత్ ఉండదు.
- ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సీతంపేట, ఎన్టీఆర్ కాలనీ, కృష్ణ నగర్, మూలగొయ్యి జంక్షన్ ప్రాంతాలలో సరఫరా నిలిపివేస్తారు.

పేదల బియ్యం పక్కదారి

రాజమహేంద్రవరం సిటీ: పేదల బియ్యం పక్కదారి పడుతుంటే కూటమి నాయకులు బోద్యం చూస్తున్నారని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ధ్వజమెత్తారు. ఆయన గురువారం రాజమహేంద్రవరంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి పాలనలో పేదల ఆకలి తీర్చేందుకు ఉపయోగపడాల్సిన బియ్యాన్ని అక్రమ మార్గాల ద్వారా రైసుమిల్లులకు చేర్చి దళారీలు కోట్ల రూపాయలు సంపాదించుకుంటున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరచి, పేదల పొట్ట కొడుతున్న ఈ లింక్ సిస్టమ్‌ను నిర్వీర్యం చేయాలన్నారు.

టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే దాడి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: తెలుగుదేశం పార్టీ స్థానిక నాయకుల ప్రోద్బలంతోనే తనపై యాంకర్ కావ్యశ్రీ, ఆమె తండ్రి నాగరాజు దాడి చేసి తప్పుడు కేసులు బనాయించారని వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నేత ఎన్‌వీ శ్రీనివాస్ ఆరోపించారు. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాంకర్ కావ్య శ్రీ, ఆమె తండ్రి నాగరాజు మద్యం తాగి ఉద్దేశపూర్వకంగానే తన ఇంటికి వచ్చి దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కావ్యశ్రీకి బాకీ ఉన్న మాట వాస్తవమేనన్నారు. దాన్ని త్వరలోనే తీర్చివేస్తానని ఆమె తండ్రి నాగరాజుతో పాటు కావ్యశ్రీకి సమాచారం అందించానన్నారు. బాకీ డబ్బులు వసూలు చేయాలంటే ఇతర మార్గాలు ఆశ్రయించాలి తప్ప, ఇలా దాడి చేయడం సరికాదన్నారు. మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను లక్ష్యంగా చేసుకుని, ఆయన గౌరవం చెడగొట్టాలనే ఉద్దేశంతో కొందరు ఇలాంటి ఘటనలు చేయిస్తున్నారన్నారు. టీడీపీ నాయకుల పథక రచనతోనే తనపై దాడి జరిగిందని ఆరోపించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకులు నక్కా శ్రీ నగేష్, వల్లూరి రాజు పాల్గొన్నారు.

డీపీవో మృతితో విషాదఛాయలు



బొమ్మూరులో ఇటీవల జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాసరావు (ఫైల్)



డీపీవో శ్రీనివాసరావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా పంచాయతీ అధికారి బొబ్బరాడ శ్రీనివాసరావు (57) మృతితో గురువారం జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి. విశాఖ జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న ఆయన గత నెల 30వ తేదీన బదిలీపై జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ 16 రోజుల్లోనే బాధ్యతాయుతంగా పనిచేసి కలెక్టర్ నుంచి పంచాయతీ కార్యదర్శుల వరకూ అందరికీ ఆదర్శప్రాయుడిగా నిలిచారు. విశాఖపట్నం కూర్మన్నపాలెం ఆయన స్వస్థలం. 1999లో ముమ్మిడివరం ఎంపీడీవోగా ప్రభుత్వ సర్వీసులో చేరి పెద్దాపురం ఎంపీడీవోగా, విశాఖపట్నం జిల్లాలో జిల్లా పరిషత్ అకౌంట్స్ ఆఫీసర్‌గా, డిప్యూటీ సీఈవోగా, డ్వామా పీడీగా విధులు నిర్వహించారు. ఆయనకు భార్య రాజకుమారి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఏడాది ఆగస్టు 11వ తేదీన ఆయన చిన్న కుమార్తె వివాహం రాజమహేంద్రవరం రూరల్ ఎంపీడీవో డి.శ్రీనివాసరావు కుమారుడితో జరిగింది.

పలువురి నివాళి

జిల్లా పంచాయతీ అధికారి బి.శ్రీనివాసరావు మృతి వార్త తెలియగానే జిల్లా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. ఆయన పార్థివ దేహానికి కలెక్టర్ పి.ప్రశాంతి, జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు, డీఆర్‌వో నరసింహులు, జిల్లా గిరిజన సంక్షేమసాధికారిత అధికారి కె.నాగజ్యోతి, డీఎల్‌పీవోలు నాగలత, అమ్మాజీ, ఈవోపీఆర్‌డీలు నివాళులర్పించారు.

విశాఖకు తరలింపు

డీపీవో శ్రీనివాసరావు పార్థివదేహాన్ని స్వస్థలమైన విశాఖపట్నంలోని కూర్మన్నపాలేనికి ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు. ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, పలువురు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కుటుంబసభ్యులు విశాఖకు తరలివెళ్లారు. ఆయన అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించనున్నారు.

ఎంతో బాధాకరం

జిల్లా పంచాయతీ అధికారి బి.శ్రీనివాసరావు మృతి బాధాకరమని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీపీవో శ్రీనివాసరావు సంతాప సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర జిల్లా అధికారులు నివాళులు అర్పించారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



రామాయణంలోని స్త్రీల వేషధారణలో ఆకట్టుకున్న విద్యార్థినులు



ఆర్ట్స్ కళాశాలలో జ్యోతి వెలిగిస్తున్న ప్రముఖులు



వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వరరావు

సీటీఆర్ఐ: వేద సారమే రామాయణమని ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల సంస్కృత అధ్యాపకురాలు డాక్టర్ ప్రభల శ్రీవల్లి అన్నారు. స్థానిక ప్రభుత్వ రాజ్యలక్ష్మి మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రామాయణంలోని స్త్రీల పాత్రల వేషధారణలో విద్యార్థినులు అలరించారు. శ్రీవల్లి మాట్లాడుతూ సామాన్యుడికి సైతం వేద ధర్మాలను తెలియజెప్పడానికే వాల్మీకి మహర్షి రామాయణాన్ని అందించారన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రతన్ కుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాలలో..

మహర్షి వాల్మీకి ప్రజలకు వేదాంత మార్గ నిర్దేశకుడని ప్రసిద్ధ నాట్యాచార్యుడు డాక్టర్ సప్పా దుర్గాప్రసాద్ అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ కళాశాల తెలుగు, సంస్కృత శాఖ, హిందీ శాఖ సంయుక్త నిర్వహణలో గురువారం వాల్మీకి జయంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వాల్మీకి కార్యాచరణవేత్తగా, దార్శనికుడిగా, తపస్విగా బహురూపాల్లో మనకు దర్శనమిస్తాడన్నారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ పీవీబీ సంజీవరావు మాట్లాడుతూ రాముడు పరశురామునికి, హనుమంతునికి తన విశ్వరూపాన్ని తెలియజేశాడన్నారు. మరో ప్రధాన వక్త, సంస్కృత ఆచార్యులు ఏవీఎస్‌డీ శ్రీనివాసరావు మాట్లాడుతూ రామాయణంలోని రామ శబ్దానికి గల మంత్ర తత్వాన్ని వివరించారు.

ఆర్ట్స్ కళాశాలలో..

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెమినార్ హాలులో తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురువారం ఆదికవి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాలాధిపతి, తెలుగు, సంస్కృత శాఖల అధ్యాపకులు, కళాశాల ఎన్ఎస్ఎస్ నిర్వాహకులు జ్యోతి ప్రజ్వలన చేశారు. వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్‌కే రామచంద్రరావు మాట్లాడుతూ భారతీయ సమాజానికి రామాయణమే దిక్సూచి అని తెలిపారు.

వాల్మీకి అందరికీ ఆదర్శం

రాజమహేంద్రవరం రూరల్: వాల్మీకి మహర్షి జీవితం అందరికి ఆదర్శమని, ఆయన రచించిన రామాయణం భారతీయ సమాజానికి మార్గదర్శకమని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బొమ్మూరులోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆఫీస్ సూపరింటెండెంట్ కేవీ సత్యనారాయణ, డీఐవో ఎన్.రాజకుమారి, డిప్యూటీ డెమో ఎస్.సత్య కుమార్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

రాజమహేంద్రవరం సిటీ: కలెక్టరేట్‌లో వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి కలెక్టర్ పి.ప్రశాంతి పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్నరాముడు, జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు, బీసీ సంక్షేమ అధికారి బి.శశాంక, గిరిజన సంక్షేమ అధికారి కేఎస్ జ్యోతి, జిల్లా వ్యవసాయ అధికారి ఎస్.మాధవరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ ధర్నా



ధర్నా అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవరావుకు వినతి పత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కంబాలచెరువు: మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలంటూ ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద ధర్నా చేశారు. కార్యక్రమాన్ని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రూపస్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ మాట్లాడుతూ మున్సిపల్ హైస్కూళ్లలో తగినంత మంది సబ్జెక్టు టీచర్లను నియమించేందుకు వీలుగా ఎస్‌జీటీ, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులలో అర్హులైన వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించాలన్నారు. మున్సిపల్ ప్రధానోపాధ్యాయుల్లో అర్హులను అర్బన్ ఎంఈవోలు నియమించాలని, మున్సిపల్ టీచర్ల బదిలీలు వెంటనే చేపట్టాలని, మున్సిపల్ టీచర్లకు జీపీఎఫ్ ఖాతాలు తెరిపించాలని, మున్సిపల్ పాఠశాలల్లో నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్ మాట్లాడుతూ ఎస్‌సీఈఆర్‌టీలో డిప్యూటేషన్ ప్రాతిపదికన అధ్యాపక పోస్టుల భర్తీ కోసం పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అర్హత కలిగిన మున్సిపల్ ఉపాధ్యాయులను అనుమతించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే అక్టోబర్ 24న విద్యాశాఖ డైరెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా చేపడతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఎస్. రవిబాబు, డి.శ్రీమణి, రమేష్ బాబు, నగర అధ్యక్షులు జీవీ అప్పారావు, ప్రధాన కార్యదర్శి జేవీవీ సుబ్బారావు, నరేష్, జేడీ సుహాసిని, తేజ విజయ్ కుమార్, ప్రసన్నేశ్వరి పాల్గొన్నారు.

పీహెచ్‌డీ చేసేందుకు అర్హత



రవికుమార్

కంబాలచెరువు: స్థానిక సిటీ మున్సిపల్ హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్ (సోషల్ టీచర్)గా పని చేస్తున్న శ్రీకాకోళపు రవికుమార్ 2024 సంవత్సరానికి నిర్వహించే ఏపీ రీసెర్చ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌లో ఇంటర్వ్యూలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. దీంతో వెంకటేశ్వర యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ చేసేందుకు అర్హత పొందారు. రవికుమార్ ఇంతకుముందే తెలుగు, ఎడ్యుకేషన్‌లలో ఏపీ సెట్, యూజీసీ నెట్ కూడా క్వాలిఫై అయ్యారు. 2012 డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ సోషల్ సబ్జెక్టులో తూర్పుగోదావరి జిల్లా ఫస్ట్ ర్యాంక్ సాధించారు. అదే డీఎస్సీలో స్కూల్ అసిస్టెంట్ తెలుగు సబ్జెక్టులో జిల్లా 20వ ర్యాంకు సాధించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి ఎంఏ తెలుగు, ఎంఏ ఎకనామిక్స్‌లలో పీజీ చేశారు. ప్రస్తుతం సిటీ మున్సిపల్ హైస్కూల్‌లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయునిగా సేవలందిస్తున్నారు.

తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు

- శివారు ప్రాంతాలకూ అందేలా చూడాలి
- కమిషనర్ కేతన్ గార్గ్



హెడ్ వాటర్ వర్క్స్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరం సిటీ: నగర ప్రజలకు ఎలాంటి ఆటంకం లేకుండా శివారు ప్రాంతాల వరకు తాగునీరు అందించాలని కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం నగరపాలక సంస్థ ప్రధాన నీటి సరఫరా కేంద్రాన్ని సందర్శించారు అక్కడి పరిస్థితులను, నీరు శుద్ధి చేస్తున్న విధానాలను పరిశీలించారు. కొత్తగా కొనుగోలు చేసిన 150 హెచ్‌పీ వెర్టికల్ టర్బైన్ పంప్ సెట్‌ను ప్రారంభించారు. దీని ద్వారా అదనపు నీటిని సరఫరా చేయవచ్చన్నారు. ప్రతి టాప్ ఇన్ స్పెక్టర్, ఫిట్టర్ తన పరిధిలోని చివర పాయింట్ వరకు నీరు అందుతున్నదీ, లేనిది పరిశీలించాలన్నారు. చివరి పాయింట్‌లో కూడా నీటిలో క్లోరిన్ శాతం నిర్దేశించిన విధంగా ఉండాలని ఆదేశించారు. ఈ నెలాఖరులో అల్పపీడనాలు ఏర్పడి, వర్షాలు విస్తారంగా కురిసే అవకాశం ఉందన్నారు. కాబట్టి నీటి సరఫరా ఇబ్బందులు లేకుండా చూడాలని, నాణ్యతను, మోటార్ల పనితీరును పరిశీలించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మదర్షా అలీ, అసిస్టెంట్ ఇంజనీరు శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

22 కేజీల గంజాయి స్వాధీనం

కంబాలచెరువు: స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయితో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసారు. ఆల్కాట్ గార్డెన్స్‌కు చెందిన యర్రా గణేష్, ఇన్నీసుపేటకు చెందిన యాదవ్ ప్రసాద్, ఉల్లితోటకు చెందిన గారపాటి దుర్గాప్రసాద్ అనే రౌడీషీటర్లు గూడ్స్ గేట్ వద్ద గంజాయి తరలిస్తున్నారు. విషయం తెలిసిన టూటౌన్ సీఐ దుర్గారావు ఆ ప్రాంతంలో దాడి చేసి నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 22 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసారు. వీరిని రిమాండ్ నిమిత్తం సెంట్రల్ జైలుకి తరలించారు.

మొబైల్ స్పీడు బ్రేకర్లు



ఆవ రోడ్డుపై తిష్ట వేసిన ఆవులు

రాజమహేంద్రవరం నగరపాలకసంస్థ పరిధిలో 16వ డివిజన్ ఆవ రోడ్డులో ఆవులతో వాహనచోదకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రాత్రి సమయంలో ఆవులు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చేస్తున్నాయి. వాటిని ఢీకొని వాహనచోదకులు కింద పడి గాయాల పాలవుతున్నారు. ఆవులు ఉదయం పాలు ఇచ్చే సమయానికి యజమానులు తీసుకువెళ్లి మళ్లీ ఇలా వదిలేస్తున్నారు.

– ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్)